రంగుల ఆహారం..విషతుల్యం

ఆహార భద్రత, నియంత్రణ చట్టం నిబంధనల ప్రకారం ఆహార పదార్థాల్లో పరిమితికి మించి రంగులు కలపకూడదు. అయినా పరిమితికి మించి రంగులను వాడుతున్నారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు కొందరు తయారీదారులు ఇష్టానుసారంగా రంగులు కలుపుతూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వారిని కట్టడి చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు.



కావలిలోని ఓ ఫాస్ట్‌ఫుడ్ దుకాణంలో వినియోగిస్తున్న రంగులు కలిపిన ఆహారపదార్థాలు

కావలి: పట్టణంలో బిర్యానీ పాయింట్లు, చికెన్ పకోడీ దుకాణాలు, మిఠాయి దుకాణాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు రోజురోజుకు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వీధికో బిర్యానీ పాయింట్‌ను ఏర్పాటు చేసి రూ.120 నుంచి రూ.150కే కేజీ చికెన్ దమ్ బిర్యానీ అంటూ బోర్డులు పెట్టి అమ్ముతున్నారు. బిర్యానీలో ఎటువంటి రంగులు కలపరాదని ఆహార భద్రత, నియంత్రణ చట్టంలో నిబంధన ఉంది. దీనికి కొందరు బిర్యానీ పాయింట్ల నిర్వాహకులు నీళ్లు వదులుతున్నారు. వినియోగదారులను ఆకట్టుకునేందుకు అనుమతి లేని సింథటిక్ రంగులను కలుపుతున్నారు. రుచికోసం నిషేధిత టేస్టింగ్ సాల్ట్‌ను సైతం వాడుతున్నారు.ప్రస్తుతం మార్కెట్లో నిత్యావసర సరుకులతో పాటు వంట నూనెల ధరలు చుక్కలను చూస్తున్నాయి. ధరల తాకిడి, వ్యాపార రంగంలో పోటీని తట్టుకునేందుకు నిబంధనలకు నీళ్లు వదిలి తక్కువ ధరకు లభించే నూనెలు, డాల్డాలను వినియోగిస్తున్నారు. నిల్వ చికెన్‌ను సైతం వినియోగిస్తున్నారు. చికెన్ వాసన రాకుండా వెనిగర్‌తో కడుగుతున్నారు. తక్కువ ధరకే ఇంటిల్లిపాదికి బిర్యానీ వస్తుండడంతో ప్రజలు ఆరోగ్యాన్ని విస్మరించి కొనుగోలు చేస్తున్నారు. నాణ్యతలేని ఇటువంటి బిర్యానీల కారణంగా దీర్ఘకాలంలో గ్యాస్ట్రిక్ సంబంధిత సమస్యలతో పాటు రసాయనాల కారణంగా కేన్సర్ ముప్పు పొంచి ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చికెన్ పకోడీ దుకాణాల్లోనూ..

పట్టణంలో ప్రతి సెంటర్‌లో ఇబ్బడి ముబ్బడిగా చికెన్ పకోడీ దుకాణాలు వెలిశాయి. వాటిలో చికెన్ పకోడీతో పాటు చికెన్ పీసులు, లెగ్‌పీసులు ఆకర్షణీయంగా కనిపించేందుకు రంగులను పరిమితికి మించి కలుపుతున్నారు. పదేపదే మరిగించిన నూనెల్లోనే వేయిస్తున్నారు. మరిగించిన నూనెను ఎక్కువసార్లు వినియోగిస్తే కేన్సర్ ముప్పు పెరుగుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నా వ్యాపారులు లెక్కచేయడం లేదు. రూ.80 నుంచి రూ.100కే పావుకిలో చికెన్‌పకోడి ఇస్తుండడంతో ప్రజలు కూడా విపరీతంగా కొనుగోలు చేస్తున్నారు. కొందరు కర్రీస్ పాయింట్ల నిర్వాహకులు సైతం ఇదే పంథాను అనుసరిస్తున్నారు. సాంబారు, దొండకాయ వేపుడు, బంగాళదుంప కూరల్లోనూ పరిమితికి మించి రంగులు కలిపి విక్రయాలు చేస్తున్నారు.

బేకరీల్లోనూ ఇదే తంతు

బేకరీల్లోనూ ఇదే తంతు నడుస్తోంది. కేక్‌లు, స్వీట్‌లలో మోతాదుకు మించి రంగులు వినియోగిస్తున్నారు. చిన్నపిల్లలను ఆకట్టుకునేలా కూల్‌కేక్‌లు, కొబ్బరికేక్‌లు, చాక్‌లెట్ కేకులు అంటూ రంగులతో నింపేస్తున్నారు. వీటిని తిన్నతరువాత నోరంతా రంగు మారిపోవడంతో పాటు నోరు, పెదాలు దురద పుట్టడం వంటి సమస్యలు కూడా వస్తున్నాయి. చిన్నపిల్లల పుట్టినరోజు కేకులకు కూడా విపరీతంగా రంగులు వినియోగిస్తున్నారు. వీటితో పాటు ఐస్‌క్రీములు, ఫాలుదా వంటి శీతల పానియాల్లో కూడా నాణ్యతలేని, నిషేధిత రంగులు, రసాయనాలు వినియోగిస్తున్నారు.



రంగులు కలిపిన చికెన్

తనిఖీలు లేకపోవడంతో..

గతంలో ఆహార భద్రత నియంత్రణ శాఖ అధికారులు తరచూ ఆహార దుకాణాల్లో తనిఖీలు నిర్వహించే వారు, పరిమితికి మించి రంగులతో తయారు చేసిన ఆహార పదార్థాలను గుర్తించి భూమిలో పూడ్చడంతో పాటు కేసులు నమోదు చేసేవారు. ఇటీవల కాలంలో అధికారుల తనిఖీలు కొరవడడంతో రంగుల ఆహార విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఆహార భద్రత, నియంత్రణ చట్టం నిబంధనల ప్రకారం ఆహార పదార్థాల్లో పరిమితికి మించి రంగులు కలపకూడదు. అయినా పోటీని తట్టుకునేందుకు, కస్టమర్లను ఆకర్షించేందుకు వ్యాపారులు మోతాదుకు మించి రంగులు, రసాయనాలు వినియోగిస్తుండడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. అధికారుల తనిఖీలు అంతంత మాత్రంగా ఉండడంతో వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది.

గుండె జబ్బులకు అవకాశం

ఫాస్ట్‌ఫుడ్ అమ్మకాలు చేసేవారు ఆహారపదార్థాలు ఆకర్షణీయంగా ఉండడానికి రంగుల కోసం మెటానియల్ ఎల్లో, టార్‌ట్రాజిన్ అనే రసాయనాలు, రుచికోసం టేస్టింగ్‌సాల్ట్‌ను వాడుతున్నారు. వీటిని వాడకూడదు. వీటివల్ల గుండె జబ్బులు, పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంది. ప్రజలు ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యంగా ఉంటూ ఫాస్ట్‌ఫుడ్‌లను సరదాగా తినేస్తున్నారు. ప్రజలు రంగులు కలిపిన ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆహార పదార్థాల్లో పరిమితికి మించి రంగులను వాడితే చర్యలు తీసుకుంటాం. వాటిని కట్టడి చేసేందుకు తనిఖీలు చేపడుతాం.

–జీ వెంకటేశ్వరరావు,
అసిస్టెంట్ ఫుడ్‌కంట్రోలర్, నెల్లూరు

రోడ్డుకు మరమ్మతులు చేపట్టరూ..



కావలి: పట్టణంలోని సినిమాహాల్ రోడ్డులో భుజంగరాయశర్మ వీధి ప్రారంభంలో రోడ్డుపై భారీ రంధ్రం ఏర్పడింది. రంధ్రానికి మరమ్మతులు చేపట్టాల్సిన మున్సిపల్ సిబ్బంది హెచ్చరిక బోర్డు పెట్టి అలాగే వదిలేశారు. ఈ కారణంగా వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

క్విజ్ పోటీల్లో సోమశిల విద్యార్థుల ప్రతిభ

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిల ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభకనబరిచారు. నెల్లూరులో శనివారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో విద్యార్థులు ఎస్కే బాబు, వీ చైత్రిక రెడ్డి, మల్లెం కొండయ్య విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం గుండుబోయిన పెంచలయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

బీజేపీ నాయకుల సంబరాలు

సోమశిల: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎన్‌డీఏ కూటమి భారీ విజయం సాధించడంతో అనంతసాగరం మండల బీజేపీ నాయకులు శనివారం సంబరాలు జరుపుకొన్నారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగదీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దుప్పట్ల పంపిణీ



కావలి: పట్టణంలోని శివరామసుబ్బయ్య కాలనీలోని నిరుపేదలకు హ్యాపీ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఒకటో పట్టణ ఎస్సై షేక్ జమాల్ మాట్లాడుతూ హ్యాపీ సేవా సంస్థ సలహాదారులు చేవూరు ప్రభయ్య తన తల్లి చేవూరు లక్ష్మమ్మ జ్ఞాపకార్థంగా దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షుడు సయ్యద్ ఘనీబాషా, హ్యాపీ సేవా సంస్థ ఉపాధ్యక్షుడు దేవరకొండ విజయ్, సభ్యులు షేక్ చాన్‌బాషా, చేవూరు విజయమ్మ, కోటేశ్వరమ్మ, లోక్‌అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు



ఉదయగిరి: స్థానిక యాదవపాళెంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ మస్తాన్‌వలి శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన, పఠనా ప్రగతిని పరిశీలించి మెరుగైన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి మెనూ ప్రకారం వడ్డించాలని సూచించారు.

వాటర్‌ప్లాంట్‌కు స్థల పరిశీలన



ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ఎస్సీ కాలనీలో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ఎంపీడీఓ అప్పాజీ శనివారం స్థల పరిశీలన చేశారు. గతంలో కాలనీ వాసులు తాగునీటికి పడుతున్న ఇబ్బందులను ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి స్థల పరిశీన చేశారు. త్వరితగతిన నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు. స్థానికులు భాస్కర్, ఉమాసాయి, నరసింహరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎంపీడీఓ తనిఖీలు



కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పంచాయతీ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, కుటుంబ సర్వేను ఎంపీడీఓ శ్రీనివాస రెడ్డి శనివారం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల బరువులు, ఎత్తులను చూసి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. బయోమెట్రిక్ హాజరును తప్పనిసరిగా వేయాలని సూచించారు. క్షేత్ర పర్యటనకు వెళ్లే సిబ్బంది మూమెంట్ రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లను వచ్చే నెల 5వ తేదీలోగా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఈఓ శివకుమార్ ఉన్నారు.

ఆశీర్వచనం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని వీఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి జరిగిన సొసైటీ మాజీ అధ్యక్షుడు మద్దూరి చిన్నికృష్ణారెడ్డి కుమారుడి వివాహానికి వైఎస్సార్‌సీపీ నేత మేకపాటి అభినవ్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు హాజరయ్యారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కూడా నూతన దంపతులను ఆశీర్వదించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ తనిఖీ



మర్రిపాడు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆత్మకూరు డీఈ ఐ శ్రీనివాసులు శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సోలార్ విద్యుత్‌పై రైతులకు అవగాహన కల్పించాలని ఏఈ రామచంద్రయ్యకు సూచించారు.

భూ సమస్యల పరిష్కారం ఎన్నడో?

జలదంకి: రైతుల భూ సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో భూముల రీ సర్వే చేపట్టారు. రీ సర్వేకు సంబంధించిను సమస్యలను పరిష్కరిస్తున్న సమయంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో సమస్యలు అలాగే ఉండిపోయాయి. ఆ తరువాత అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ తీరును తప్పుపడుతూ రీ సర్వే జరిగిన పంచాయతీల్లో భూ క్రయ, విక్రయాలు, రిజిస్ట్రేషన్లను నిలిపేసింది. అయితే ప్రభుత్వానికి పెద్ద ఎత్తున రెవెన్యూ లోటు కనబడడం, రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో రీ సర్వే జరిగిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గత నెలలో అధికారులు గ్రామసభలను నిర్వహించారు. రీ సర్వేకు సంబంధించిన సమస్యలు ఉన్న రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కానీ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. జలదంకి మండలంలోని రీసర్వే జరిగిన మూడు రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ అధికారులు గ్రామసభలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతుల నుంచి మొత్తం 209 అర్జీలు అందాయి. అత్యధికంగా మ్యుటేషన్‌కు 75, ఎక్స్టెంట్ వేరియేషన్‌కు 73 దరఖాస్తులు వచ్చాయి. అలాగే జాయింట్ ఎల్‌పీ-5, క్లాసిఫికేషన్-2, పేరు మార్పు- 47, మల్టిపుల్ ఖాతా-2 చొప్పున అర్జీలు అందాయి. ప్రతి అర్జీని అధికారులు ఆన్‌లైన్ చేశారు. ఇప్పటి వరకు వాటికి పరిష్కారం చూపకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కేశవరంలో గ్రామసభ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)

అర్జీల పరిష్కారానికి చర్యలు

గ్రామసభల్లో వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్ చేశాం. ప్రస్తుతం గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తున్నాం. క్షేత్రస్థాయిలోకి వెళ్లి కొలతలు తేడా ఉన్న అర్జీలకు మా వద్ద ఉన్న పాత రికార్డుల ఆధారంగా పరిష్కారం చూపుతున్నాం. అర్జీల పరిష్కారానికి డిసెంబర్ చివరి వరకు గడువు ఉంది. అప్పటిలోగా అన్ని సమస్యలను పరిష్కరిస్తాం.

–ప్రమీల, తహసీల్దార్

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించండి



అవగాహన కల్పిస్తున్న ఏఓ రామ్మోహన్

మర్రిపాడు: పొగాకుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఏఓ రామ్మోహన్ సూచించారు. మండలంలోని భీమవరం, నందవరం గ్రామాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో పొగాకు రైతులకు గడ్డు పరిస్థితి ఉంటుందన్నారు. అందుకు బదులుగా నవంబరులో తెల్ల జొన్న, శనగ పంటలను సాగుచేసుకోవాలని సూచించారు. డిసెంబరులో శారదా రకం నువ్వులు సాగు చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. వీఏఏలు ప్రవీణ్, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌కళాశాలల పోటీలకు వ్యవసాయ విద్యార్థులు



ఉదయగిరి: స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలకు చెందిన తృతీయ సంవత్సరం విద్యార్థులు అంతర్ కళాశాలల క్రీడాపోటీలకు శనివారం శ్రీకాకుళం బయలుదేరి వెళ్లారు. కళాశాల డీన్ కృష్ణారెడ్డి జెండా ఊపి బస్సును పంపారు. ఈనెల 25 నుంచి 28 వరకు శ్రీకాకుళంలో జరిగే అంతర్‌కళాశాలల క్రీడా,కల్చరల్ పోటీల్లో కళాశాలకు చెందిన 30 మంది విద్యార్థులు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

26న రైతు సంఘం ధర్నా

జలదంకి: ఈ నెల 26న రైతు సంఘం ఆధ్వర్యంలో కావలిలో చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను శనివారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు లీటరుకు రూ.5 సబ్సిడీ చెల్లించాలన్నారు. గొర్రెలు, మేకలకు ఉచితంగా మందులు అందజేయాలన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి రోజుకు రూ. 600 వేతనం అందించాలని కోరారు. ఈ రైతు సంఘ నాయకులు తాళ్లూరి మాల్యాద్రి, రావి మాల్యాద్రి, రాధాకృష్ణయ్య, ఆంథోనిబాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరువాసికి సేవా పురస్కారం



అల్లూరు: పట్టణానికి చెందిన పేట రాఘవయ్యకు సేవా పురస్కారం లభించింది. నెల్లూరులోని పురమందిరంలో పినాకిని యూత్ వెల్ఫేర్‌అసోసియేషన్, శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రాఘవయ్య సేవలను గుర్తించి పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు కుటుంబసభ్యులు, స్నేహితులు, అల్లూరు ప్రజలు అభినందనలు తెలిపారు.

ఉచిత పశువైద్య శిబిరం

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని శంకవరంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మేలు జాతి పశువుల ఉత్పత్తి విధానం, పశుగ్రాసాల సాగు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పశువైద్య నిపుణులు సోమయ్య, నివాసరావు, జయచంద్ర, కొమ్మి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి బ్రూసెల్లోసిస్ నివారణ టీకాలు

వరికుంటపాడు: ఈ నెల 25 నుంచి వచ్చే నెల 19వతేదీ వరకు పెయ్య దూడలకు బ్రూసెల్లోసిస్ నివారణ టీకాలను వేయనున్నట్లు మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ శనివారం తెలిపారు. బ్రూసెల్లోసిస్ వ్యాధితో గర్భధారణ సమయంలో ఈసుకుపోవడం జరుగుతుందన్నారు. పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 4నెలల నుంచి 8 నెలల వయస్సు ఉన్న లేగదూడలకు టీకాలను తప్పక వేయించుకోవాలని సూచించారు.

రేపు మహాభస్మాభిషేకం, సహస్ర జ్యోతిర్లింగార్చన

వరికుంటపాడు: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ఈ నెల 25న గండిపాళెం జలాశయం ప్రాంగణంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయంలో మహాభస్మాభిషేకం, పంచామృతాభిషేకం, సహస్రజ్యోతిర్లింగార్చన సహిత జ్వాలాతోరణం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని పరమేశ్వరుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

తెల్లరాయి అక్రమ తవ్వకాల అడ్డగింత

వరికుంటపాడు: మండలంలోని జంగంరెడ్డిపల్లె సమీపంలోని తిప్పవద్ద చేపడుతున్న తెల్లరాయి అక్రమ తవ్వకాలను గ్రామస్తులు శనివారం అడ్డుకున్నారు. వేకువజామున కొందరు యంత్రాల సాయంతో తవ్వకాలు చేపడుతుండడాన్ని గమనించిన గ్రామస్తులు అక్కడకు చేరుకుని అడ్డుకున్నారు. ఎవరు అనుమతులు ఇచ్చారని నిలదీశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని ఎస్సై రఘునాథ్‌కు వినతిపత్రం అందజేశారు.

ముమ్మరంగా ఫాగింగ్



కావలి: పట్టణంలో ఫాగింగ్ ముమ్మరంగా చేపడుతున్నారు. పట్టణంలో దోమలు విజృంభిస్తుండడంతో ప్రజలకు కంటి మీద ఉండడం లేదు. దీంతో మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు సిబ్బంది ప్రతిరోజూ సాయంత్రం ఏదోక ప్రాంతంలో ఫాగింగ్ చేపడుతున్నారు.

నిర్మించారు..వదిలేశారు

నిరుపయోగంగా మినరల్ వాటర్‌ప్లాంటు



దుత్తలూరు: స్థానిక ఏసీకాలనీ వద్ద నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించకుండానే నిరుపయోగంగా వదిలేశారు. ఏసీకాలనీవాసులకు మినరల్ వాటర్‌ను అందించే లక్ష్యంతో ఏడేళ్ల క్రితం ఎస్‌ఆర్డీడబ్ల్యూపీ పథకం కింద రూ.6.40 లక్షల వ్యయంతో వాటర్‌ప్లాంట్‌ను నిర్మించారు. ఆ తరువాత ఏం జరిగిందో ఏమో ప్రారంభించకుండానే నిరుపయోగంగా వదిలేశారు. లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించి నిరుపయోగంగా వదిలేయడంపై స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి సురక్షిత నీటిని అందజేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



పట్టణ ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు



జవహర్ భారతి కళాశాలలో...

కావలి: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని డాక్టర్ మేఘనాథ్ చౌదరి పేర్కొన్నారు. ఎన్‌సీసీడే వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని రాజీవ్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో పాతూరు మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల వాడకంతో కాలుష్యం పెరిగిపోతోందన్నారు. అడవులు అంతరించిపోతుండడం వల్ల పర్యావరణం దెబ్బతింటోందన్నారు. భావితరాల మనుగడ కోసం ప్రతిఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. పాఠశాల హెచ్‌ఎం సుబ్బారావు, ఉపాధ్యాయులు మధుసూదన్, సుజాత, ఎన్‌సీసీ అధికారి మస్తాన్‌వలి పాల్గొన్నారు.

జవహర్ భారతి కళాశాలలో...

ఎన్‌సీసీ డే వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జవహర్‌భారతి కళాశాల క్రీడామైదానంలో ఎన్‌సీసీ ఆర్మీ విభాగం క్యాడెట్లు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కళాశాల ప్రిన్సిపల్ పీ సుబ్రహ్మణ్యానాయుడు మాట్లాడుతూ జీవకోటి మనుగడకు చెట్లే ఆధారమన్నారు. మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. స్వయం ఉపాధి కోర్సుల సంచాలకులు ఆర్ మాల్యాద్రి, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ జేఎస్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

తాళ్లూరికి నివాళులు

కావలి: దగదర్తి మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తాళ్లూరి రమణయ్యానాయుడు ఉత్తర క్రియలు శనివారం జరిగాయి. దగదర్తిలోని స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరై తాళ్లూరుకు నివాళులర్పించారు. తాళ్లూరి కుమారులు దగదర్తి ఎంపీపీ ప్రసాద్‌నాయుడు, రవినాయుడు, కోడలు, జెడ్పీటీసీ తాళ్లూరు స్వరూపరాణికి సానుభూతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ,మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్యానాయుడు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పలువురు జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు హాజరయ్యారు.



తాళ్లూరు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాకాణి, రామిరెడ్డి

పేద మహిళ జీవనోపాధికి ఏఎస్సై చేయూత

కావలి: పట్టణంలోని జంగాలకాలనీకి చెందిన నిరుపేద మహిళ నేలపనేని అంకమ్మ జీవనోపాధికి ఏఎస్సై మార్తూరి పరమేశ్వరి శనివారం చేయూతనందించారు. ఇటీవల అంకమ్మ భర్త కేన్సర్ వ్యాధితో మరణించారు. అప్పట్నుంచి అంకమ్మ జీవనోపాధికి ఇబ్బందులు పడుతోంది. ఈ విషయాన్ని సంయుక్త సేవా సంస్థ ద్వారా తెలుసుకున్న పట్టణానికి చెందిన, గూడూరు పోలీసు స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మార్తూరి పరమేశ్వరి తన తల్లిదండ్రులైన మార్తూరి మాలకొండయ్య,సరోజనమ్మ జ్ఞాపకార్థంగా అంకమ్మకు దుస్తుల వ్యాపారానికి సహకారం అందజేశారు. ఈ సందర్భంగా సంయుక్త సేవా సంస్థ ద్వారా చదువుకుంటున్న పేద విద్యార్థులకు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో మార్తూరి పద్మ, సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



అంకమ్మకు కొత్త దుస్తులు అందజేస్తున్న ఏఎస్సై మార్తూరి పరమేశ్వరి

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి అంబళ పూజ



ఆత్మకూరు: పట్టణంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి అంబళ పూజోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. తొలుత అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన భారీ వేదికపై విఘ్నేశ్వరుడు, అయ్యప్ప, సుబ్రహ్మణ్య స్వాముల ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అర్చకులు మేళ్లచెరువు శివకుమారశర్మ నేతృత్వంలో 108 కలశాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకం చేశారు. అనంతరం మెట్ల పూజ నిర్వహించారు. ఆత్మకూరు పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప మాలధారులు పెద్ద ఎత్తున పాల్గొని భజనలు చేశారు. సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.